ప్రజాశక్తి

శుక్రవారం 12 ఏప్రిల్ 2024

I

అల్లూరి సీతారామరాజు

సిల్వర్ ఓక్ తోటలు దగ్ధం

ప్రజాశక్తి -ముంచంగిపుట్టు: మండలంలోని వనభసింగి పంచాయతీ లంగాపుట్టు గ్రామంలో సిల్వర్ ఓక్ తోటలకు దుండగలు నిప్పంటించడంతో దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన గిరిజన రైతులు వండేడెబు లక్ష్మణ్, గబుడు తిరుపతి, పి.మాలన్న, పి.శంకర్రావు, జి.నారాయణ, పల్లుల గణపతిల సిల్వర్ తోటకు సమీపాన ఉన్న చెత్తకు గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి నిప్పు పెట్టారు. విపరీతమైన గాలి వీయడంతో మంటలు చెలరేగి సిల్వర్ తోటల వైపు వ్యాపించాయి. సిల్వర్ తోటలు దగ్ధమయ్యాయి. గిరిజన రైతులు రాత్రికి రాత్రే హుటాహుటిన సిల్వర్ తోటల వద్దకు చేరుకుని గంటల తరబడి ఎంతో శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. నష్టపోయిన రైతులను గుర్తించి పరిహారం చెల్లించాలని బాధిత రైతులు కోరారు.

దగ్ధమవుతున్న తోటలు

ఆదివాసీల అభివృద్ధి సిపిఎంతోనే సాధ్యం

మాట్లాడుతున్న సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు

ప్రజాశక్తి-రంపచోడవరం

సిపిఎం ప్రజా ప్రతినిధులు ఉంటేనే ఏజెన్సీ ప్రాంతమైన రంపచోడవరం నియోజకవర్గంలో అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ నియోజకవర్గం సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు మట్ల వాణిశ్రీ తదితరులతో కలిసి లోతా రామారావు గురువారం మండలంలోని పెదపాడు, డోనులపాడు, ఊట్ల, మునిజిడుగుల, నల్లగొండ, రంప తదితర గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెదపాడు గ్రామంలోని గిరిజనులు తాగునీరు, రోడ్లు, హౌసింగ్ సమస్యలు, ఊట్ల గ్రామంలో రోడ్డు సమస్యను ప్రజలు సిపిఎం నేతల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా లోత రామారావు మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారిన గిరిజనుల తలరాతలు మారడం లేదని, ఏజెన్సీలోని గిరిజనులకు ఉన్న ప్రత్యేక చట్టాలను అమలు చేయడంలో పాలకవర్గ పార్టీలు వైఫల్యం చెందాయని విమర్శించారు. నియోజకవర్గంలోని ప్రజలు టిడిపి, వైసిపి పాలన చూశారని, సిపిఎం కూడా ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తామని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటికి ఖమ్మం జిల్లా భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యేలుగా సిపిఎం నాయకులు కుంజా బొజ్జి, సున్నం రాజయ్య ఆ ప్రాంతాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని, అదే వరవడిలో నిస్వార్థంగా రంపచోడవరం నియోజకవర్గ అభివృద్ధికి తాను కూడా కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వంతల రాంబాబు, ఈతపల్లి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామవరంలో ప్రజలతో కలిసి నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు

రామవరం పంచాయతీలో ప్రచారం

విఆర్.పురం : మండలంలో రామవరం పంచాయతీ పరిధి సోపల్లి, అడివి వెంకన్న గూడెం, లక్ష్మీనగరం గ్రామాల్లో సిపిఎం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు లోతా రామారావు, పి.అప్పలనర్సలను గెలిపించాలని కోరుతూ సిపిఎం నాయకులు ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లోని ప్రజలతో సమావేశాలు నిర్వహించిన సిపిఎం అభ్యర్థులను గెలిపించాల్సిన ప్రాధాన్యతను తెలియజేశారు. కార్యక్రమంలో రామవరం సర్పంచ్ కారం బుచ్చమ్మ, సిపిఎం నాయకులు వడ్లది రమేష్, కుంజ నాగిరెడ్డి, కారం సుందరయ్య, సోడి మల్లయ్య, జి.లక్ష్మణరావు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

లక్కవరంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు సీసం సురేష్

లక్కవరం గ్రామంలో...

మోతుగూడెం : చింతూరు మండలం లక్కవరం గ్రామంలో సిపిఎం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు లోతా రామారావు, పి.అప్పలనర్సను గెలిపించాలని కోరుతూ సిపిఎం నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పల్లపు వెంకట్, ఎర్రంశెట్టి శ్రీనివాస్, సీసం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొండ రెడ్ల గ్రామాల్లో లోతా రామారావు విస్తృత పర్యటన

ప్రజాశక్తి-విఆర్.పురం

కాంగ్రెస్, సిపిఐ, ఆమ్ ఆద్మీ పార్టీలు బలపర్చిన రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం సిపిఎం అభ్యర్థి లోతా రామారావు గురువారం మండలంలోని మారుమూల గిరిజన కొండరెడ్ల గ్రామాల్లో స్థానిక సిపిఎం నాయకులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. పోతవరం నుండి జలమార్గంలో లాంచీలో 20 కిలోమీటర్లు ప్రయాణించి, గోదావరి తీరం నుండి కాలినడకన కొండలు ఎక్కి కొల్లూరు, కొండేపూడి, తమ్మిలేరు, కొటూరు, కొమ్ము తదితర గ్రామాలకు చేరుకున్నారు. అక్కడి గిరిజనులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల గిరిజనులు పోడు భూములకు పట్టాలు, పోలవరం నిర్వాసితుల కుటుంబాల్లో 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఇతర సమస్యలను రామారావు దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ 1/70, ఇతర గిరిజన చట్టాలు, జిఒ3 వంటివి అమలు జరగాలన్నా, పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కావాలన్నా చట్ట సభల్లో గొంతెత్తి గళం విప్పే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచ్‌లు పూనెం సరోజినీ, కారం బుచ్చమ్మ, పులి సంతోష్ కుమార్, మాజీ సర్పంచ్‌లు కుంజా నాగిరెడ్డి, పులి ధర్మరాజు, సవలం మారయ్య, సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, వడ్లది రమేష్, కొండారెడ్డి, సోడి మల్లయ్య, పండా వెంకటేశ్వర్లు, జి.గుండెపూడి, లక్ష్మణరావు, కమ్మచెచ్చు సత్తిబాబు, కాంతారావు, పులి బుజ్జి, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

కొండరెడ్ల తెగ ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం అభ్యర్థి రామారావు

లాంచీ దిగి కొండరెడ్ల గ్రామాలకు నడిచి వెళ్తున్న రామారావు తదితరులు

పాఠాలు బోధిస్తున్న అధ్యాపకులు

ప్రతిభ కనబరుస్తున్న గిరిపుత్రులు

- 43 మంది గ్రూపు -2 మెయిన్స్‌కు అర్హత
- ఫలితాలు ఇస్తున్న ఐటిడిఎ ఉచిత శిక్షణలు

ప్రజాశక్తి-పాడేరు: వివిధ పోటీ పరీక్షలలో గిరిజన యువత సత్తా చాటుతున్నారు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమీషన్ నిర్వహించిన గ్రూపు-1, గ్రూపు -2 పరీక్షలలో గిరిజన యువత మరోసారి ప్రతిభ కనబరిచి విజయాలు సాధించారు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ గత ఏడాది నవంబరు నెలలో ప్రాజెక్టు లక్ష్య పేరుతో నిరుద్యోగ గిరిజన యువతకు వేపగుంట వైటిసిలో అప్పటి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలిసి సివిల్స్ ఉచిత శిక్షణను ప్రారంభించారు.

ఐటిడిఏ సౌజన్యంతో రాజమండ్రి 21 వ సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 64 మంది గిరిజన యువతీ, యువకులకు సివిల్స్, గ్రూప్ 1, గ్రూప్ -2, పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తున్నారు. ఉత్తమ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో అవసరమైన కోచింగ్ అందిస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ ఈనెల 10 వ తేదీన విడుదల చేసిన గ్రూపు -2 ప్రిలిమినరీ పరీక్షలకు 59 మంది అభ్యర్దులు హాజరు కాగా వీరిలో 43 మంది గ్రూపు -2 మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించారు. గత ఏడాది నిర్వహించిన గ్రూపు 1లో చిట్టపులి జీవన, నవ్యసాయి గౌరి ఐటిడిఏ శిక్షణను సద్వినియోగం చేసుకుని గ్రూప్ 1 ఉద్యోగాలు సాధించారు.

గిరిజన యువతకు గొప్ప సదవకాశం : పిఒ

ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ మాట్లాడుతూ, ఐటిడిఏ నేతృత్వంలో వేపగుంట వైటిసిలో ఉచితంగా గిరిజన యువతీ, యువకులకు సివిల్స్ శిక్షణ అందిస్తున్నామన్నారు. 21 వ సెంచరీ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన పలువురు ప్రభుత్వ కొలువులు సాధిస్తున్నారని తెలిపారు. అదే స్ఫూర్తితో 2023 నవంబరులో రెండవ సారి సివిల్ ఉచిత శిక్షణను ప్రారంభించామని, సివిల్స్ ఉచిత శిక్షణను 9 నెలలు కొనసాగిస్తామన్నారు. గిరిజన యువత ఐఏఎస్, ఐ.పి.ఎస్, ఐ.ఎఫ్.ఎస్, ఇతర సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలు సాధించే విధంగా ఉత్తమ శిక్షణ అందిస్తున్నామని, తాను కూడా స్వయంగా ఈ శిక్షణా కార్యక్రమాన్ని పర్యవేక్షించడం తరగతులు చెప్పడంతో గిరిజన యువతను పోటీ పరీక్షలపై చైతన్యవంతం చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

గిరిజన యువతకు వాలీబాల్ కిట్టు అందిస్తున్న ఎస్ఐ అప్పలసూరి

మావోయిస్టుల కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-సీలేరు

మావోయిస్టు పార్టీ కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని, వారికి ఎటువంటి సహాయ సహకారాలు చేయవద్దని జీకే వీధి ఎస్ఐ అప్పలసూరి హితవు పలికారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన ఒరిస్సాలోని డబల్ పహాడ్, బంగారు సుధా, కట్టుగూడ, ఆంధ్రాలోని అమ్మోరు దారకొండ పంచాయతీ పరిధి గడిబంద దుర్గం, జాజిపాకలు, గోల్కొండ పంచాయతీలోని ఎర్రగడ్డ , బొడ్డగొంది, పేములగొంది, గేజింగ్ తదితర గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. అక్కడి గిరిజనులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అందరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గంజాయి సాగుకు దూరంగా ఉండాలని, వాటి స్థానంలో ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. అందుకు కావాల్సిన సహాయ సహకారాలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించి విద్యాబుద్ధులు నేర్పించాలని సూచించారు. గ్రామాల్లో సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా యువ క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

గోదావరి డెల్టాకు 3.15 టిఎంసిల నీరు విడుదల

ప్రజాశక్తి -సీలేరు



విడుదల చేస్తున్న నీరు

గోదావరి డెల్టాకు ఇప్పటి వరకు 3.15 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. స్థానిక విలేకర్లతో ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 12 వరకు గోదావరి డెల్టాకి 7000 క్యూసెక్కులు నీటి విడుదల కొనసాగించాలని ఇరిగేషన్ అధికారులు కోరడంతో ఈ మేరకు నీటి విడుదల గడువును పెంచినట్లు చెప్పారు. సీలేరు, డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి అనంతరం 3,500 క్యూసెక్కులు, నేరుగా దిగువసీలేరు, డొంకరాయి జలాశయం రెండు గేట్లు ద్వారా మరో 3500 క్యూసెక్కులు నీటిని గోదావరి డెల్టాకు విడుదల చేస్తున్నామని చెప్పారు. సీలేరు కాంప్లెక్స్‌లో గ్రిడ్ ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామన్నారు. ఆంధ్ర ఒరిస్సా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయంలో ఆంధ్ర వాటా 16.0179 టీఎంసీలు ఉండగా, డొంకరాయి జలాశయంలో 7.2169 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. జూన్ నెలాఖరు వరకు ఈ నీటిని విద్యుత్ ఉత్పత్తికి, గోదావరి డెల్టాకు, తాగునీటికి పొదుపుగా వినియోగించనుకుంటామని తెలిపారు.

రాళ్ల రహదారిలో.. రాకపోకలు ఎలా?

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో కిలగాడ ప్రధాన రహదారి నుండి కొత్తులబయలు, దారేల నుంచి పేటమాలిపుట్ గ్రామాలకు వెళ్లే రహదారి ఆరు సంవత్సరాలుగా శిధిలావస్థలో ఉన్నా పట్టించుకునే నాథుడే లేడు. దీంతో, ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు.

కిలగాడ ప్రధాన రహదారి నుండి కొత్తులబయలు గ్రామం మీదుగా దారేల పంచాయతీ పలు గ్రామాలకు వెళ్లే ఈ రహదారి గుండా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, జీపులు రాకపోకలు సాగిస్తున్నాయి. అత్యవసర పరిస్థితులలో ఈ రహదారి గుండా ప్రయాణం సాగించాలంటే రాలుతేలి ఉండటంతో పలు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయని ద్విచక్ర వాహన దారులు, పాదసారులు తెలిపారు. గత తెలుగుదేశం, వైసిపి ప్రభుత్వాలు రహదారి మరమ్మతుకు నిధులు మంజూరు చేయక పోవడంతో శిథిలమైన రహదారి మార్గంలో అష్ట కష్టాలు పడి రాకపోకలు సాగిస్తున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేపట్టాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

రాళ్లు తేలిన దారెల రహదారి

రాళ్లు తేలిన దారెల గ్రామ రహదారిపై వెళుతున్న దిచక్రవాహనదారుడు

టిడిపి రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తా

-బిజెపికి సహకరించేది లేదు

- దొన్ను దొర

మాట్లాడుతున్న దొన్నుదొర

ప్రజాశక్తి -అరకులోయ : తెలుగుదేశం పార్టీ అధిష్టానం తనకు పార్టీ టికెట్ ఇచ్చి మోసం చేసిందని, దీంతో తాను టిడిపి రెబల్ అభ్యర్థిగా అరకు అసెంబ్లీ నుంచి పోటీ చేస్తున్నట్లు ఆ పార్టీ సమన్వయకర్త దొన్నుదొర స్పష్టం చేశారు. గురువారం అరకులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దొన్నుదొర మాట్లాడుతూ, 10 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీని అరకు నియోజకవర్గంలో బలోపేతం చేయడానికి తీవ్రంగా శ్రమించినట్లు తెలిపారు. పార్టీ అధిష్టానం అరకులో జరిగిన బహిరంగ రా కదలిరా సభలో అధినేత చంద్రబాబు నాయుడు తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించారని ఆయన అన్నారు. దీంతో తెలుగుదేశం పార్టీ శ్రేణులంతా సంబరపడి అవిశ్రాంతంగా గ్రామాల్లో తిరిగి ప్రచారం చేశామన్నారు. ఇటువంటి తరుణంలో ఓటు బ్యాంకు లేని బీజేపీతో అధినేత జతకట్టి పొత్తులో భాగంగా తన టికెట్టును క్యాన్సల్ చేసి బిజెపి అభ్యర్థి పాంగి రాజారావుకు కేటాయించడం తనను తీవ్రంగా కుంగ దీసిందన్నారు. కార్యకర్తల మనోభావాలను తీసుకోకుండా బిజెపికి ఈ టికెట్ కేటాయించడం ఎవ్వరు కూడా జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. నియోజక వర్గంలోని ఆరు మండలాల నాయకులు, కార్యకర్తల అభీష్టం మేరకు తాను అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నానన్నారు. అరకు నియోజకవర్గంలో బిజెపికి సహకరించేది లేదని స్పష్టం చేశారు. తనకు ఎమ్మెల్సీ ఇస్తామని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చినప్పటికీ ఆ మాటలు నాయకులు, కార్యకర్తలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. బిజెపికి అరకు టికెట్ కేటాయించడంతో ఇక్కడి టిడిపి శ్రేణుల రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆయన అన్నారు. తనను నమ్ముకున్న కార్యకర్తలకు నాయకులకు తాను ద్రోహం చేయనని వారి నిర్ణయం మేరకే రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జి.మాడుగుల మసీదులో ప్రార్థనకు హాజరైన ముస్లిములు

ఘనంగా రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి-జి.మాడుగుల: స్థానిక మసీదులో రంజాన్ వేడుకలను గురువారం ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ముస్లిం సోదరులు విందును ఏర్పాటు చేశారు.

సీలేరు: జికె.వీధి మండలం సీలేరులో ముస్లిములు రంజాన్ వేడుకలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా మసీదులో కురాన్ చదివి అల్లాని స్మరించుకున్నారు. అనంతరం మసీదు దగ్గర నుంచి ర్యాలీగా బయలుదేరి అల్లా ఉ అక్బర్ అల్లా అంటూ నినాదాలు చేసుకుంటూ శ్మశాన వాటికకు చేరుకున్నారు. అమరలైన మహమ్మదీయుల సమాధులపై పుష్పాలు ఉంచి ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిములు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అనారోగ్యంతో బాలిక మృతి

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని నుర్మతి గ్రామంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో అనారోగ్యంతో 8వ తరగతి చదువుతున్న బాలిక మృతి చెందింది. స్థానికుల అందించిన వివరాలు..ఈనెల 8న అనారోగ్యం కారణంగా పాఠశాల నుండి తన సొంత గ్రామం అమ్మడేలు గ్రామానికి బాలిక వచ్చింది. ఆరోగ్యం కుదుటపడక పోయినా పాఠశాలలో పరీక్షలు ఉండటంతో తిరిగి తల్లిదండ్రులు 10న పాఠశాలకు తీసుకెళ్లారు. పాఠశాలలో 11న మృతి చెందింది.

గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి-అనంతగిరి: తమ గ్రామాలకు రోడ్డు, తాగునీటి వంటి సౌకర్యాలు కల్పించాలని గిరిజనులు డిమాండ్ చేశారు. టీడీపీ, వైసీపీ పార్టీలకు ఓట్లు వేసి మోస పోయామని గుమ్మ పంచాయతీ ఫోర్లు, కరకవలస, కొత్తూరు పంచాయతీ బూసిపాడు, టెంకెబుడ్డి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం బూసిపాడును సందర్శించిన సీపీఎం నాయకులు వంతల బుద్రయ్యతో కలిసి గిరిజనులు కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాదల చిన్నరావు, పట్టం భీమయ్య, బోయిన అప్పారావు మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో తమ గ్రామాలకు రోడ్డు, తాగునీటి తదితర సౌకర్యాలు కల్పిస్తామని కచ్చితమైన హామీ ఇచ్చిన వారికే ఓట్లు వేస్తామని తెలిపారు. తమ కోసం పోరాటం చేసే పార్టీకే మద్దతు అని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయ పార్టీల నేతలు వస్తున్నారని, గెలిచిన తర్వాత తమ గ్రామాలను కనీసం పటించుకున్న నాదుడే కరువువ్యయరని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

నినాదాలు చేస్తున్న గిరిజనులు

బండారు సూర్యనారాయణకు ఘన నివాళి

నివాలలర్పిస్తున్న సిపిఎం నేతలు, ప్రజలు

ప్రజాశక్తి-ఎటపాక :భద్రాచలం మండలంలో సిపిఎం నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన పార్టీ సీనియర్ నాయకులు బండారు సూర్యనారాయణ 32వ వర్ధంతి కార్యక్రమం ఆంధ్రాలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గొల్లగట్ట గ్రామంలో స్థానిక శాఖ ఆధ్వర్యాన నిర్వహించారు. సూర్యనారాయణ చిత్రపటానికి పార్టీ మండల నాయకులు, మాజీ సర్పంచ్ ఇరప సత్యం పూలమాల ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బిపిజి.తిలక్, బండారు శరత్ బాబు, ఇరప సత్యం మాట్లాడుతూ రైతులు, గిరిజనుల సమస్యలపై సూర్యనారాయణ అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. పార్టీ మీద నిర్బంధం ఉన్న కాలంలో పార్టీ నాయకులను కార్యకర్తలను కంటికి రెప్పలాగా కాపాడుకున్న చరిత్ర గొలగట్ట గ్రామానికి ఉందని, అందులో బండారు సూర్యనారాయణ పాత్ర ఎనలేనిదని చెప్పారు. తునికాకు రేటు పెంచాలని కోరుతూ దళంగా బయలుదేరి మండలంలో అన్ని గ్రామాలలో ప్రచారం చేశారని. ఆ దళానికి బండారు సూర్యనారాయణ నాయకత్వం వహించారని తెలిపారు. నక్సలైట్లు దాడి చేసి గాయపరిచిన బెదరకుండా గొలగట్ట గ్రామంలోనే నివాసమంటూ పార్టీని మరింత బలోపేతం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బి స్టాలిన్, బండారు ప్రతాప్ కుమార్, బండారు సుందరయ్య, జి హరనాథ్, కల్లూరి సత్యం, జోగయ్య, ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు ఎస్ భూపేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నాలుగు మండలాలకు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-రంపచోడవరం : విద్యుత్ లైన్ల మరమ్మతులు, లైన్లకు దగ్గరగా ఉన్న చెట్లకొమ్మలు నరుకుతున్న కారణంగా (ట్రీ కటింగ్) గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాల పరిధిలోని గ్రామాలకు ఈ నెల 12న శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఇఇ యం.డి.యూసఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కూటమి అభ్యర్థుల ప్రచారాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి- చింతూరు : చింతూరు మండలంలో 12న జరగనున్న జనసేన, టిడిపి, బిజెపి కూటమి పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులు కొత్తపల్లి గీత, మిరియాల శిరీషాదేవి ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనసేన మండల నాయకులు విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు ఆనందం పెద్ద, నక్క శేఖర్, చిచ్చుడి రమ్య, నక్క వినోద్, సిహెచ్.ఆకాష్, కోట మహేష్, జి బద్రి, తుర్రం అఖిల్, బంగారు రవీంద్ర పాల్గొన్నారు.

జ్యోతిరావుపూలేకు ఘననివాళి

జ్యోతిరావుపూలేకు ఘననివాళి అర్పిస్తున్న జెన్‌కో ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ జెన్కో ఎస్సీ సివిల్ కేకే వి. ప్రశాంత్ కుమార్ ఈఈ లక్ష్మీనారాయణ హాజరై పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జ్యోతిరావు పూలే లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేసి సమానత్వం స్వేచ్ఛని కోరుకున్న మహా నేత అని పేర్కొన్నారు. పూలే, ఆయన సతీమణి సావిత్రిబాయి పూలే బాల్యవివాహాల పట్ల చైతన్యాన్ని తీసుకువచ్చారని గుర్తు చేశారు. జ్యోతిరావు పూలే ఆశయాలను నెరవేర్చే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ. శ్రీనివాస్, కార్యదర్శి ఆర్ ఎన్. రామకృష్ణ, బీసీ నాయకులు వై ధాత్రరాజు, ఇవివి.సత్యనారాయణ ఎస్.నాగేశ్వరరావు జి .శివప్రసాద్, ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి, ఏపీ జెన్కో సబ్ ఇంజనీర్ శ్రీనివాస్, కాంట్రాక్ట్ కార్మికులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం అభ్యర్థుల గెలుపుతోనే ప్రజా సమస్యల పరిష్కారం

డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, పెదబయలులో ప్రచారం చేపడుతున్న నాయకులు

- ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం
- పెద్దఎత్తున పాల్గొన్న సిపిఎం, ప్రజాసంఘాల నేతలు
- అక్కునచేర్చుకున్న మారుమూల పల్లెల గిరిజనులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : గిరిజనుల పక్షాన పోరాడే సిపిఎం అభ్యర్థులను రానున్న ఎన్నికల్లో మంచి మెజార్టీతో గెలిపించి, చట్టసభలకు పంపాలని ఆ పార్టీ మండల ప్రధానకార్యదర్శి ఎస్‌బి పోతురాజు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గిరిజన ప్రాంత సమగ్రాభివృద్ధి సిపిఎంతోనే సాధ్యమన్నారు. గిరిజన హక్కులకు, చట్టాలకు ఎటువంటి భంగం కలిగినా వెంటనే స్పందించేంది సిపిఎం నాయకులు మాత్రమేనని, వాటి పరిరక్షణకు గిరిజన పక్షాన పోరాటం సాగిస్తున్నారన్నారు. సిపిఎం తరపున అరకు ఎమ్మెల్యే అభ్యర్థిగా దీసరి గంగరాజు, అరకు ఎంపీ అభ్యర్థిగా పాచిపెంట అప్పలనర్సకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు టి సూర్యనారాయణ, సిపిఎం మాజీ సర్పంచ్ పి.సురేష్‌కుమార్, మండల నాయకుడు పి.సత్యనారాయణ, వార్డు సభ్యులు సిహెచ్ రమేష్, టి.పాపారావు, నాయకులు, నూకరాజు, నరేంద్ర, సింగన్న, నర్సింగ్, పాలికి పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు : అరకు ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో సిపిఎం అభ్యర్థులుగా పోటీలో ఉన్న పి.అప్పలనర్స, దీసరి గంగరాజులకు ఓట్లేసి మంచి మెజార్టీతో గెలిపించాలని మండల వైస్ ఎంపిపి- 1 పి.సత్యనారాయణ కోరారు. గురువారం మండలంలోని కరిముఖిపుట్ పంచాయతీ గేదెలబంద గ్రామంలో సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గడచిన ఐదేళ్ల పాలనలో గిరిజనుల హక్కులు, చట్టాలను వైసిపి ప్రభుత్వం తుంగలో తొక్కి, మన్యవాసులకు తీరని అన్యాయం చేసిందన్నారు. బిజెపితో కూటమిగా ఏర్పడిన టిడిపి, జనసేన, పార్టీలు బలపరిచిన అభ్యర్థులను ఓడించాలన్నారు. గిరిజన హక్కులు, చట్టాలను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి పాంగి భీమరాజు, జిల్లా కమిటీ సభ్యుడు కొర్ర త్రినాథ్, సీనియర్ నాయకులు గాసిరం దొర, ఎంఎం శ్రీను, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి నరసయ్య, నర్సింగ్ పడాల్, రామదాసు, నారాయణ, జీనబంధు గ్రామస్తులు పాల్గొన్నారు.

అతి మారుమూల గ్రామాల్లో విస్తృత ప్రచారం

సిపిఎం అభ్యర్థుల గెలుపుతోనే మారుమూల ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యపడుతుందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొర్ర త్రినాథ్ పిలుపునిచ్చారు. గురువారం ముంచంగిపుట్టుమండలంలోని అతి మారుమూల ప్రాంతమైన బూసిపుట్టు, జామిగూడ పంచాయతీల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో సిపిఎం తరపున అరకు ఎమ్మెల్యేగా దీసరి గంగరాజు, అరకు ఎంపీగా పాచిపెంట అప్పలనర్స పోటీలో ఉన్నారని, వారిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను సిపిఎం బృందం దృష్టికి తెచ్చారు. మండల కేంద్రం నుండి జామిగుడ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం, బూసిపుట్టులో ఆసుపత్రి, బూసిపుట్టు నుండి గిన్నెలకోట వరకు తారురోడ్డు నిర్మాణం, గ్రామాల్లో రోడ్లు,డ్రైనేజీలు, అర్హులకు పోడు భూములకు సాగుహక్కు పట్టాల పంపిణీ, అంతోదయ కార్డులు మంజూరు వంటి పలు సమస్యలను స్థానికులు విన్నవించగా, సిపిఎం అభ్యర్థులు విజయం సాధిస్తే, వాటన్నింటినీ పోరాడి సాధించుకుందామని భరోసానిచ్చారు కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి.భీమరాజు, ఎంఎం.శ్రీను, గాసిరం దొర, నర్సింగ్‌పడాల్, జి.నారాయణ, పి.రామదాసు, జీనబంధు, బుజ్జిబాబు, కొండయ్య, చంద్రయ్య, పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలోని అడుగులపుట్టు పంచాయతీ జంగంపుట్టు, చిందిపుట్టు, లాకెపుట్టులో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు కె.శరబన్న, జంపరంగి సునీల్ కుమార్, సిపిఎం నాటకులు పరశురాం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి పనిప్రదేశం వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. సిపిఎం పోరాడి సాధించిన ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేయాలని చూస్తున్నాయని కూలీలకు వివరించారు. సిపిఎం అభ్యర్థులను గెలిపించి, చట్టసభలకు పంపిస్తే గిరిజనులతోపాటు అన్ని వర్గాల ప్రజల హక్కులపై గళం విప్పి సాధించుకోవడానికి ఆస్కారము ఒటుందన్నారు. అరకు ఎమ్మెల్యేగా దీసరి గంగరాజు, అరకు ఎంపీగా పి. అప్పలనర్సలను కొడవలి, సుత్తి, నక్షత్రం గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

సీలేరు : అరకు పార్లమెంట్ స్థానానికి సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న పి.అప్పలనర్సను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ సిపిఎం నాయకులు గురువారం జికె.వీధి మండలం తంగలగొంది, మంగలపాలెం, బొడ్డుమానుపాకల తదితర గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గాలికొండ ఎంపిటిసి సభ్యులు అంపరంగి బుజ్జిబాబు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గిరిజన చట్టాలను సవరిస్తూ, హక్కులను హరిస్తుందని, దీనికి రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు మద్దతుగా నిలుస్తున్నాయని తెలిపారు. గిరిజన హక్కులు, చట్టాలు రక్షించబడాలంటే సిపిఎం ప్రజాప్రతినిధులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు జి.సత్యనారాయణ, కె.బాలయ్య బి.కోటి, ఎ.దారకొండ ఉపసర్పంచ్ ఎం.చంటిబాబు, రామారావు, బి.రామారావు, గేమ్మెల పరమేశ్వరరావు, అప్పారావు, లచ్చయ్య, బాబురావు, చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు, పెదబయలు, సీలేరులలో ప్రచారం చేపడుతున్న సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం, ఇతర ప్రజా సంఘాల నాయకులు

దువ్వాడ మీదుగా మరిన్ని వేసవి ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా మరిన్ని ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ముఖ్యంగా సూరత్ - బ్రహ్మపూర్ - సూరత్, నాగర్‌కోయిల్ - డిబ్రూగఢ్ - నాగర్‌కోయిల్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపాలని భావించింది. గురువారం రైల్వే అధికారులు అందించిన వివరాల ప్రకారం.. 09069 సూరత్-బ్రహ్మపూర్ ప్రత్యేక రైలు ఏప్రిల్ 17, 24, మే 1, 8, 15, 22, 29, జూన్ 5, 12, 19, 26 తేదీలలో మధ్యాహ్నం 14.20 గంటలకు సూరత్‌లో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 20:10 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 20.12 గంటలకు బయలుదేరి మరుసటి రోజు అర్ధరాత్రి (మూడో రోజు) 01.15 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. 09070 బ్రహ్మపూర్ - సూరత్ ప్రత్యేక రైలు ఏప్రిల్ 19, 26, మే 3, 10, 17, 24, 31, జూన్ 7, 14, 21 28 తేదీలలో ప్రతి బుధవారం తెల్లవారుజామున 03.30 గంటలకు బ్రహ్మపూర్ నుంచి బయలుదేరి, అదేరోజు రాత్రి 08:20 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 08.22 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 13.45 గంటలకు సూరత్ వెళ్తుంది. ఈ రైళ్లు నందుబార్, ధరంగావ్, జలగోన్, భూసావల్, అకోలా, వార్ధా, బల్లార్ష, వరంగల్, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస మీదుగా ప్రయాణిస్తాయి. 06103 నాగర్ కోయిల్ - దిబ్రూగఢ్ సూపర్‌ఫాస్ట్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ నాగర్ 1కోయిల్‌లో ఏప్రిల్ 12, 26, మే 10 24 తేదీల్లో ప్రతి శుక్రవారం సాయంత్రం 17.45 గంటలకు బయలుదేరి శనివారం రాత్రి 23:18 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 23:20 గంటలకు బయలుదేరి సోమవారం రాత్రి 20:50 గంటలకు దిబ్రూగఢ్‌కు చేరుకుంటుంది. 06104 దిబ్రూగఢ్-నాగర్‌కోయిల్ సూపర్ ఫాస్ట్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ దిబ్రూగఢ్‌లో ఏప్రిల్ 17, మే 1, 15, 29 తేదీలలో ప్రతి బుధవారం రాత్రి 19:55 గంటలకు బయలుదేరి శుక్రవారం సాయంత్రం 16.28 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 16.30 గంటలకు బయలుదేరి శనివారం రాత్రి 21.30 గంటలకు నాగర్‌కోయిల్ వెళ్తుంది. ఈ రైళ్లు తిరువతపురం, చెంగనూర్, కొట్టాయం, ఎర్నాకులం టౌన్, అలువా, త్రిసూర్, పాలక్కాడ్, కోయంబత్తూర్, తిరుప్పూర్, ఈరోడ్, సేలం, కాట్పాడి, రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట్, దువ్వాడ, విజయనగరం, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్, డకుని, బర్ధమాన్, రామ్‌పుర్‌హట్, మాల్దా టౌన్, కిషన్‌గంజ్, న్యూ జల్పాయిగురి, జల్పైగురి రోడ్, మాతభంగా, న్యూ కూచ్ బీహార్, న్యూ అలీపుర్‌దువార్, కోక్రాఝర్, న్యూ బొంగాగౌన్, గ్వోల్‌పరా టువాన్, జాగిరోడ్ మీదుగా ప్రయాణిస్తాయి.

06105 నాగర్‌కోయిల్-దిబ్రూగఢ్ సూపర్‌ఫాస్ట్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 19, మే 03, 17, 31 తేదీల్లో ప్రతి శుక్రవారం సాయంత్రం 17.45 గంటలకు నాగర్‌కోయిల్‌లో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 23:18 గంటలకు దువ్వాడ చేరుకొని మరల 23:20 గంటలకు బయలుదేరి సోమవారం రాత్రి 20.50 గంటలకు దిబ్రూగఢ్ చేరుకుంటుంది. 06106 దిబ్రూగఢ్ - నాగర్‌కోయిల్ సూపర్ ఫాస్ట్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 24, మే 8, 22, జూన్ 6 తేదీల్లో ప్రతి బుధవారం రాత్రి 19:55 గంటలకు దిబ్రూగఢ్‌లో బయలుదేరి శుక్రవారం సాయంత్రం 16.28 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 16.30 గంటలకు బయలుదేరి శనివారం రాత్రి 21.30 గంటలకు నాగర్‌కోయిల్ చేరుకుంటుంది. ఈ రైళు తిరువునంతపురం, చెంగనూర్, కొట్టాయం, ఎర్నాకులం టౌన్, అలువా, త్రిసూర్, పాలక్కాడ్, కోయంబత్తూర్, తిరుప్పూర్, ఈరోడ్, సేలం, కాట్పాడి, రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, విజయనగరం, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్, డకుని, బర్ధమాన్, రామ్‌పుర్‌హట్, మాల్దా టౌన్, కిషన్‌గంజ్, న్యూ జల్పాయిగుడి, జల్పైగురి రోడ్, మాతభంగా, న్యూ కూచ్ బీహార్, న్యూ అలీపుర్ దువార్, కోక్రాఝర్, న్యూ బొంగాగౌన్, గ్వోల్‌పరా టువాన్, జాగిరోడ్ మీదుగా ప్రయాణిస్తాయి.

కొల్లూరు హట్స్‌కు అనుమతులు కట్.!

- వందల కుటుంబాలకు దూరమైన జీవనోపాధి
- రాత్రి బస లేక వెలవెలబోయిన పర్యాటక వ్యాపారాలు
- అటవీశాఖ నిర్ణయంతో గిరిజన కొండరెడ్లు ఆవేదన

ప్రజాశక్తి- విఆర్.పురం: పాపికొండలు విహారయాత్రలో మధురానుభూతిని మిగిల్చే కొల్లూరు రాత్రి బసకు అటవీశాఖ అనుమతులు నిరాకరణతో పర్యాటకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వందల కుటుంబాలు జీవనోపాధికి కోల్పోయి రోడ్డున పడ్డామని ఆవేదన చెందుతున్నారు.

గోదావరి నదీమార్గాన బోటులో పాపికొండలు టూర్‌కు వెళ్లే పర్యాటకులు, కొల్లూరు వద్ద నదిగర్భంలో ఇసుక తిన్నెలపై ఆహ్లాదకర, ప్రశాంత వాతావరణంలో వెదురుతో నిర్మించిన గుడిసెల్లో నైట్‌హాల్ట్ చేస్తారు. వీటి ఏర్పాటు, నిర్వహణకు పాపికొండల పరిసర గ్రామాల గిరిజన కొండరెడ్లు చూసేవారు. అంతేకాక పర్యాటకం ఆధారంగానే హోటల్స్, కూల్‌డ్రింక్స్ దుకాణాలు, బ్యాంబో చికెన్, రకరకాల అందమైన వెదురుతో తయారు చేసిన బొమ్మల అమ్మకం ఇలా పలు వ్యాపారాలతో అనేక కుటుంబాలు జీవనం సాగించేవి. ఏడాదిలో వేసవిలోనే సాగే ఈ పాపికొండల పర్యాటక యాత్రలో సంపాదించిన ఆదాయంతో వీరంతా ఏడాది పొడుగునా జీవనం సాగించే పరిస్థితి ఉంది.

కానీ గత ఏడాది కాలంగా కొల్లూరులో నైట్‌హాల్ట్ హట్స్‌కు అటవీశాఖ అనుమతులు నిరాకరించడంతో ఏళ్లతరబడి దీనిపై ఆధారపడ్డ గిరిజన కొండరెడ్లుతో పాటు ఎంతోమంది జీవనోపాధిని కోల్పోయే పరిస్థితి ఉందని ఆవేదన చెందుతున్నారు నేషనల్ పార్కు ఏర్పాటు పేరుతో కొల్లూరులోని నైట్‌హాల్ట్‌ను నిలిపేయడంపై తమకు ఉపాధి దూరమై కుటుంబ పోషణ భారమైందని ఆవేదన చెందుతున్నారు. అన్ని ప్రాంతాలలో నైట్‌హాల్ట్ హాట్స్ నిర్వహణ ఉన్నా, ఇక్కడే ఎందుకు అపారో అర్థం కావడం లేదని వాపోతున్నారు ఇప్పటికైనా ప్రభుత్వం, అటవీశాఖ అధికారులు స్పందించి, పాపికొండల విహారయాత్రలో భాగమైన కొల్లూరులో రాత్రిబసకు వెదురు గుడిసెల నిర్వహణకు అనుమతులివ్వాలని కోరుతున్నారు.

వెదురు గుడిసెలు లేకపోవడంతో బోసిపోయి ఉన్నగోదారి నది గర్భం

గోదారమ్మ నీరు తాగేవారే లేరు.!

బ్యాక్ వాటర్ నిల్వతో బురదమయంగా ఉన్న గోదారి జలాలు

- పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంతో కాలుష్య కారకం
- అవస్థలు పడుతున్న నిర్వాసిత, ముంపు ప్రాంత ప్రజలు
- బాధితుల కష్టాలను పట్టించుకోని అధికారులు, పాలకులు

ప్రజాశక్తి-కూనవరం : జీవనది గోదావరి అంటే పవిత్రతకు మారుపేరుగా ప్రజలంతా విశ్వసిస్తారు. పశ్చిమ కనుమల్లో నాసిక్, త్రయంబకేశ్వరం వద్ద ఉద్భవించి, కొండకోనలు, నదీనదాలను దాటి తూర్పుదిక్కుగా ప్రవహించి, బంగాళాఖాతంలో కలిసి గోదావరి జలాల్లో స్నానమాచరించినా, ఆ నీటిని తాగినా ఎంతో మంచిదని జనం నమ్మకం. ఇదంతా ఒకప్పటి పరిస్థితి. నేడు కొన్ని ఇతర ప్రాంతాలకు వర్తిస్తుందేమో గానీ, పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాలు, నిర్వాసిత మండలాల్లోని ప్రజల పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నం. ఇక్కడ గోదావరి జలాలను చూస్తే ఒళ్లు జలదరిస్తుందనేది అతిశయోక్తి కాదు. ఇక్కడ నీటిలో స్నానం చేయాలన్నా, గొంతులో తడారిపోయే పరిస్థితుల్లోనైనా గుక్కెడు నీటిని తాగాలంటే స్థానిక ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. తమ ప్రాంతంలో పవిత్ర గోదావరి జలాలు అంతగా కాలుష్య కారమై పోయాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

పూర్తిగా రంగుమారిపోయి ఆకుపచ్చమయంగా మారిన గోదారి, శబరి నదుల నీరు

ప్రాచీన కాలం నుండి పరివాహక ప్రాంత ప్రజలు గోదావరి నీళ్లను తాగుతూ జీవనం సాగించడం పరిపాటి. అయితే పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అంకురార్పణ జరిగిన తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. పోలవరం ప్రాజెక్టులో భాగంగా కాపర్‌డ్యాం నిర్మాణం చేపట్టిన తర్వాత ఎగువ ప్రాంతంలో నీటి ఎగపోటు కట్టింది. దీంతో గోదావరి, శబరినది సంగమ ప్రాంతంలో కొంత కాలంగా నీరు ప్రవహించక, బ్యాక్ వాటర్ బురదమయంగా మారింది. కొన్నేళ్లు పూర్తిగా నీరు నిలిచిపోవడంతో ఈ ప్రాంతాల ప్రజలు కాలుష్యకారకమైన నీటిని తాగలేక గోదావరి, శబరి పరివాహక ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాపర్ డ్యామ్‌తో నీరు ప్రవహించక నిల్వ ఉండడంతో తాగడానికి పనికి రానంతగా తయారయ్యాయి.

పరివాహక ప్రాంతంలోని ప్రజలు పక్కనే ఉన్న గోదావరి నీటిని తాగి ఎన్నో ఏళ్లయ్యిందని అంటున్నారంటే ఇవి ఎంత కలుషితంగా మారాయో స్పష్టమౌతోంది. ఒకపుడు బోర్లు, మోటార్లున్న వారంతా గోదావరి నీటిని తాగేవారంతా ఇపుడు, అటువైపు చూడడం మానేశారు. చివరకు గోదావరి, శబరి నది పరివాహక ప్రాంతంలో పొలం పనులకు వెళ్లేవారు సైతం, పక్కనే ఉన్న నదిలో ఉన్న నీటిని తాగడం మానేసి, ఇంటి నుంచి బాటిళ్లతో నీటిని తీసుకెళ్లే దుస్థితి నెలకొందని అంటున్నారు. అంతేకాక గోదావరి ఆవలి వడ్డు నుంచి ఇవతలికి రావాలంటే ఒకప్పుడు జనవరి నెల నుంచి కాలినడకనే నదిదాటి వెళ్లే పరిస్థితి ఉండగా, ఇపుడు బ్యాక్ వాటర్ ప్రభావంతో అన్ని సీజన్లలోనూ పడవలను ఆశ్రయించక తప్పడం లేదని వాపోతున్నారు.

జీవనది చెంతనే ఉన్నా, తాగునీటికి, ఇతర అవసరాలకు ఇబ్బందులు పడే పరిస్థితుల నుంచి ఎప్పటికి విముక్తి లభిస్తుందని ముంపు ప్రాంత నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారు. పోలవరం నిర్వాసితులకు పరిహారం, ప్యాకేజీ, నివాసాలు ఇవ్వక ఏళ్లతరబడి ముంపు ప్రజల జీవితాలతో ప్రభుత్వాలు ఆటలాడుకోవడం భావ్యం కాదని అంటున్నారు. ఏటా వచ్చిపోయే వరదలకు సీజన్‌లోనూ, తర్వాత బ్యాక్‌వాటర్‌తో ఇబ్బందులు ఇంకెన్నాళ్లు భరించాలని ఆవేదన చెందుతున్నారు.ఇప్పటికైనా పోలవరం ముంపు ప్రాంత ప్రజల కష్టాలను పట్టించుకుని పరిష్కరించాలని బాధిత ప్రజలు మొరపెట్టుకుంటున్నారు.